# ఉన్నతముగా జీవించండి

ప్రేమయను పంట పండింప నలవి కాదు
ప్రేమ నమ్మట నదియంత వీలుకాదు
అహము వదలిన నావిర్భవించు ప్రేమ
మరువబోకుడు యిటువంటి మంచిమాట!

**విద్యార్థులారా!**

నేను అను అహంకారము, నాది అను మమకారమే సమస్త అనర్థములకు మూలకారణము. ప్రపంచమున ప్రతిదేశమునందు మంచి చెడ్డలు కలవారున్నారు. తెలివితేటలు కలవారు, మేధావంతులు, నిరక్షరాస్యులు కూడను ఉన్నారు. కూటిపేద కోటీశ్వరులు ఉంటున్నారు. అయితే అందరియందుకూడను సమత్వముగా మమత్వముగా ఉండినది సచ్చిదానందము. సమస్త శాస్త్రములు కూడను భగవంతుని సత్ చిత్ ఆనంద స్వరూపుడని వర్ణిస్తూ వచ్చాయి. ప్రతి పదార్థమునందు, ప్రతి విషయమునందు, ప్రతి వ్యక్తియందును, ప్రతిజీవి యందును దృశ్యకల్పితమైన జగత్తంతయు కూడను నిండినది ఉండినది ఈ సత్ చిత్ ఆనందమే. ప్రతి పదార్థమునందు సచ్చిదానందము ఉండినప్పటికిని వస్తువుల యందు, జడమైన పదార్థముల యందు సత్ చిత్ గోచరమగుచున్నదిగాని ఆనందము మనకు కనిపించటము లేదు. ఒక్క జీవులయందు మాత్రమే ఈ ఆనందము వ్యక్తమవుతున్నది. ఈ ఆనందము కూడను తాత్కాలికమైన ఆనందమే. ఈ ఆనందము రెండు విధములైఉన్నది జగత్తునందు. సాధన జన్య ఆనందము, స్వతస్సిద్ధ ఆనందము అని రెండు.

ఈ సాధన జన్య ఆనందము కేవలము విషయములతో కూడినది. ఇది అప్పటికప్పుడు పుట్టి క్షీణించునది. దానికి స్థిరత్వమనేది ఏమాత్రము ఉంటుండదు. ఆకలిగొన్నప్పుడు అన్నము

sri sathyasai vachanamrutam

భుజించే సమయములో ఆనందము. తదుపరి ఈ ఆనందము ఆకలితీరినప్పుడు ఉండదు. జగత్తునందుగల సమస్త విషయములందు కూడను అనుభవించు సమయమునందు మాత్రమే ఆనందముగాని తదుపరి ఈ ఆనందము అంతర్ధానమై పోతున్నది. చేసేంతవరకు మాత్రమే ఈ ఆనందము. అనుభవించేంత వరకు మాత్రమే ఈ ఆనందము. తదుపరి ఈ ఆనందము యేమాత్రము గోచరము కాదు. కనుకనే దీనిని సాధన జన్య ఆనందము అన్నారు. అనగా మానవుడు అప్పటికప్పుడు సంపాదించుకొని అనుభవించే ఆనందము. కాని అది నిజమైన ఆనందము కాదు.

**ఆనందమే మీ సహజ గుణము**

మానవుడు ఆనంద పిపాసి. మానవుడే ఆనందమయుడు. అతని ఆకారమే ఆనందము. స్వభావమే ఆనందము. ఇది సహజసిద్ధమైన ఆనందము. ఇట్టి ఆనందమును మానవుడు ఎందుకోసమై అనుభవించటం లేదు. తాను ఆనందమయుడై కూడను తన తత్త్వాన్ని తాను గుర్తించక, తన దృష్టిని తన భావమును ప్రపంచముపైన ప్రసరింప చేయటము చేతనే తన ఆనందమును తాను అనుభవించలేకపోతున్నాడు. తన ఆనందమంతయు ప్రకృతియందు ఉన్నదని భావిస్తున్నాడు. కాదు కాదు ఇదే పెద్ద పొరపాటు. సర్వత్రా ఉండిన ఆనందము తనయందే ఉంటున్నది. పాలలో పల ప్రతిబిందువులో వెన్న ఉంటున్నది. కాని అది మనకు కనిపించదు. ఆ పాలను పెరుగుగా చేసి పెరుగును చిలికినప్పుడే సర్వత్రా సమత్వముగా ఉన్న ఈ వెన్న ఏకత్వముగా సాక్షాత్కరిస్తుంది. అట్లు కాకుండా చేయవలసిన మార్గములో మనము పనులు చేయకుండా, దానిని మార్చవలసిన మార్గములో మనము మార్చకుండా పాలను మాత్రము హస్తము నందుంచుకొని వెన్న ఎక్కడ అని పాలను మనము గాలిస్తే ఈ సాక్షాత్కారము మనకు లభించదు. అదేవిధముగానే మానవుని మనసునందు సమస్త విధములైన ఆనందము కూడను సాక్షాత్కరింపబడినది. మనసును మధించి, మనసును శోధించి, మనసును పరిశోధించి తన తత్త్వము తాను గుర్తించినప్పుడే ఈ దివ్యత్వమైన సచ్చిదానందము మనకు లభ్యమవుతుంది.

మానవుడు ఈనాడు అన్నమయ ప్రాణమైన జీవతత్త్వాన్ని మాత్రమే సత్యమని భావించి జీవితము గడుపుతున్నాడుగాని మనోమయము వరకు కూడను తాను ప్రయాణము సల్పటం

srisathyasaivachanamrutam

లేదు. అన్నమయ దేహము. దీనికి చలన శక్తి నందించేది ప్రాణమయము. మూడవది మనోమయము. నాల్గవది విజ్ఞానమయము. తదుపరే ఆనందమయము. మానవుడు కేవలము తన జీవితయాత్రలో రెండు స్టేషనులు మాత్రమే దాటుతున్నాడు. మిగిలిన స్టేషనులకు తాను యేమాత్రము సంబంధము పెట్టుకోలేదు. ఈ అన్నమయమైన దేహమును, దీన్ని కాపాడే ప్రాణమయమైన తత్త్వాన్ని మనము విశ్వసిస్తున్నామేగాని దీనిని దాటి మనోమయ విజ్ఞానమయములలో ప్రవేశించి తదుపరే ఆనందమును అనుభవించటానికి కృషి చేయటము లేదు. కనుక మనము చేసే మార్గమునందుగాని, తలచే విషయములందు గాని, సంపూర్ణమైన తత్త్వాన్ని గుర్తించి వర్తించటము లేదు. దుర్లభమ్ మానుషో దేహః. మనుష్య జన్మము దుర్లభమైనది. ఇది కేవలము నిప్పు జ్వాలల నుండి నిప్పు కణములు బయలుదేరినట్లుగా ఈ సత్ చిత్ ఆనందము నుండియే ఈ జీవతత్త్వమనే కణములు బయలుదేరాయి. అగ్నియందు ఏవిధమైన దహనశక్తి, ప్రకాశశక్తి కలదో ఈ అణుశక్తి యందు కూడను ప్రకాశ శక్తి, దహన శక్తి సమముగా ఉంటున్నది. కనుకనే మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః అన్నది వేదము. అన్ని జీవములు నా అంశములే అని. అయితే తన అంశమైనప్పటికి ఆ సత్యమును గుర్తించకుండా ఉండుటకు కారణమేమిటి? మానవుడు ప్రాకృతమైన జీవితాన్ని అభిలషిస్తున్నాడు. అనిత్యము, అశాశ్వతము, అసత్యమైన జగత్తును వర్ణిస్తున్నాడు. అదే నిత్యము, సత్యమని భ్రమిస్తున్నాడు. తద్వారా నిత్యసత్యమైన ఆనందమునకు దూరమైపోతున్నాడు.

త్యాగమునందే నిజమైన ఆనందము లభ్యమవుతుందని కూడను ఉపనిషత్తులు బోధిస్తూ వచ్చాయి. ఈ త్యాగమంటే యేమిటి? కేవలము యిల్లువాకిలి వదలటము అరణ్యము చేరటము ఇది త్యాగమా? కాదు. కాదు. ఏ విధమైన తపస్సులు, యాగములు యజ్ఞములు చేసినంత మాత్రమున లభించేది కాదు. ఈ అమృతత్త్వమైన ఆనందము మనకు లభ్యము కావాలంటే కొన్నివిధములైన ప్రాకృత భావములను మనము అదుపులో పెట్టుకోవాలి. మానసిక సంబంధమైన భావములను విచ్చలవిడిగా వదలక దానిని మంచిచెడ్డలను discriminate చేయాలి. అనగా నిత్యా నిత్య విషయపరిశీలన చేసినప్పుడే దీని తత్త్వము మనకు అర్థమవుతుంది. కాని పిల్లలు discrimination చేస్తున్నారు. ఏ విధముగా చేస్తున్నారు. తనకు అనుగుణముగా ఉండే దానిని discrimination చేస్తున్నారు. తనకు అనుకూలమైనది మంచిది అనుకుంటున్నాడు.

sri sathyasai vahanamrutam

తన తత్త్వమును మార్చాలి. నేను నేను అనే తత్త్వము మరచి విషయాన్ని చక్కగా పరిశీలన చేసినప్పుడు సత్యము మనకు గోచరమవుతుంది. discrimination అనగా నిత్యానిత్య విషయపరిశీలనేగాని నాది పరాయిది అని పరిశీలించటము కాదు. కనుకనే నేను నాది అనే తత్త్వమును ప్రక్కకునెట్టి యీ వస్తువు యొక్క తత్త్వము మంచిచెడ్డ యేమిటి అని విచారణ చెయ్యాలి. కనుకనే మానవత్వములో ఉన్న దివ్యత్వమైన సత్ చిత్ ఆనందము వ్యక్తము కాకుండా పోవటానికి కారణము మన దృష్టి దోషమే.

## మంచి నడతయే ఆరోగ్యమునిస్తుంది

విద్యార్థులారా! జగత్తులో, సృష్టిలో ఎట్టి దోషము లేదు. మానవుని యొక్క దృష్టిలో ఉంటున్నది సమస్త దోషము. ఈ దృష్టిని కూడను తన యిచ్ఛను పురస్కరించుకొని ప్రసరింప చేస్తున్నాము. మనము ఈ పవిత్రమైన వయస్సును వ్యర్థము చేసుకొనరాదు. చాలామందిని యువకులు, యువకులు అంటున్నాము. యువకులు అంటే ఎవరని మీరు భావిస్తున్నారు. ఏ పదిహేను సంవత్సరముల నుండి ఏ ముప్పది సంవత్సరముల వరకు ఉన్నవారిని మీరు యువకులని భావిస్తున్నారా? కాదు. ఆరోగ్యవంతుడే యువకుడు. భీష్మాచార్యునకు 116 సంవత్సరములు. మహాయువకుడే. ఎట్టి వ్యాధులు లేకుండా తాను పుష్టిగా సంతుష్టిగా ఉండినవాడు కనుకనే 116 సంవత్సరములు ఉండినప్పటికి యుద్ధము చేయగలిగాడు. దీనికి కారణము ఏమిటి? నడతయే మూలకారణము. మానవత్వములో ఉండిన నడతను సక్రమమైన మార్గములో ప్రవేశపెట్టినప్పుడు తాను జీవితమంతయు ఆరోగ్యముగా ఆనందముగా ఉండగలడు. ఈ ఆరోగ్య ఆనందములు ఉండినంత వరకు తాను యువకుడే. అదే యువకులకు ప్రధానమైన ఆస్తి. అదే health is wealth. ఈ ఆరోగ్యమును కాపాడుకొనే నిమిత్తమై ఆలోచనలు సాధ్యమైనంత వరకు అదుపులో పెట్టుకోవాలి.

నిజముగా మనము శ్రీమంతులమని అనుకుంటున్నాము. ఎవరు శ్రీమంతులు? దండిగా ప్రాక్టీసు పెట్టి అనేకరకములైన ఇండ్రస్టీసు పెట్టి కోట్లకొలది డబ్బును అప్పు తీసుకొని ఏదో గొప్పగా పెద్ద పెద్ద కార్ల లోపల సంచారము చేస్తున్నాడంటే అతను కాదు శ్రీమంతుడు. మీకంతా తెలుసు టాటా, బిర్లా, కిర్లోస్కర్ ఇలాంటి వారంతా గొప్పకోటీశ్వరులని మీరు

srisathyasaivachanamrutam

భావిస్తున్నారు. కాదు. నా దృష్టి లోపల శ్రీమంతుడు ఎవరంటే ఋణములు లేనివాడే శ్రీమంతుడు. ఈ బిర్లా, ఈ కిర్లోస్కర్, ఈ టాటా వీరంతా ఏ బ్యాంకులో చూచినా అప్పులే. వీరు యెట్లా శ్రీమంతులౌతారు. కనుక ఋణస్తుడు ఎప్పుడు శ్రీమంతుడు కాదు. అనారోగ్యవంతుడు ఎప్పుడూ యువకుడు కాదు. కనుక మనము సంపాదించవలసిన శ్రీమంతత్వము యేమిటి. ఇతరులతో ఏ విధమైన సంబంధము లేకుండా మనకున్న దానితో మనము తృప్తి పడాలి. Who is the richest man in the world he who has much satisfaction is the richest man. కనుక సరైన రీతి లోపల మనము పోవాలనుకుంటే ప్రతి విషయము చక్కగా విచారణ చెయ్యాలి. మనము సంపాదించుకొంటున్నాము, ఎంతో చదువుకుంటాము, ఉద్యోగములు చేస్తాము. కాని యీ సంపాదన కూడను సక్రమమైన దానిగా మనము సంపాదన చెయ్యాలి. ఈనాటి యువకుల యందు క్షణక్షణము కూడను చీమల పుట్టలవలె కోరికలు పుట్టలు పుట్టలుగా పుడుతున్నాయి. చీమలు తిని తృప్తి పడుతున్నాయి. దాచుకొనే స్వార్థముగాని, దోచుకునే దుర్మార్గముగాని వీటికి లేదు. ఈ దాచుకొని, దోచుకునే తత్త్వము కేవలము ఒక్క మానవునియందు మాత్రమే ఉంటున్నది. కనుక నిత్యానందమును తాను అనుభవించలేకపోతున్నాడు. కేవలము తాత్కాలికమైన ఆనందమును కూడను అనుభవించలేకపోతున్నాడు.

విద్యార్థులారా! మీరు ప్రధానముగా గుర్తించవలసినది మన కోరికలను సాధ్యమైనంతవరకు అదుపులో పెట్టుకోవాలి. మన జీవితమనేది దీర్ఘ ప్రయాణము. Less luggage more comfort make travel a pleasure, Be fearless. అని మనయొక్క దీర్ఘప్రయాణములో కోరికలనేవి చాలా బరువైన లగేజి. ఈ desires ఉండవలసినదే. ప్రతి ఒక్కడు నేను ఉన్నత ఉద్యోగము అందుకోవాలని ఆశిస్తాడు. గొప్ప గౌరవమును సంపాదించాలని ఆశిస్తాడు. గొప్ప భవనాన్ని కట్టించాలని ఆశిస్తాడు. ఈ ఆశలు తప్పుకాదు. ఆశలు ఉండవలసినదే. కానీ ఈ ఆశలు దురాశలుగా కాని, మితిమీరిన ఆశలుగా రూపొందరాదు. మానవుడు ఒక కీర్తిని సంపాదించవలెనంటే జీవితములో అనేక కష్టములు, నష్టములు, నిష్ఠూరములు, అరిష్టములు వెంటాడుతూ ఉంటాయి. వీటన్నింటిని నెట్టుకొని, తట్టుకొని ముందుకు సాగిపోయినవాడే నిజమైన మానవుడు. క్షణమునకు కృంగి లొంగిఉండే



sri sathyasai vachanamrutam

మానవత్వమును మనము ఏమాత్రము అనుభవించరాదు. ఇట్టి ధైర్యమును ప్రసాదించేది ఒక దైవత్వము మాత్రమే. కారణమేమనగా దైవము సత్ చిత్ ఆనంద స్వరూపుడై వెంటనే జంటనే ఇంటనే ఉంటున్నాడు. Be fearless. God is with you. కనుక ఆ ధైర్యము లోపల జీవితయాత్ర సాగించాలి.

**మనస్సును నిగ్రహించుకోండి**

విద్యార్థులారా! విద్యనభ్యసించి విశాలమైన జగత్తులో మీరు ప్రవేశించక పూర్వము కొన్ని తెలుసుకోవలసిన విషయములంతా ఉన్నాయి. మొట్టమొదట మనము మనస్సు నిగ్రహించుకోవాలి. అప్పుడే ఈ ఇంద్రియములంతా వశమవుతాయి. నీవు Master అవుతావు. Master the mind be a master mind. ఆ రకమైన దీనిని మనము సంపాదించాలి. నీవు Master గాని servent కాదు. నీ మనస్సు నీవు ఆధీనములో ఉంచుకున్నప్పుడు నీకంటె గొప్ప Master ఇంకొకడు లేడు. నీ మాష్టరై నీ servents అయిన senses కు నీవు లొంగిపోవటం చేత యెన్నో విధములైన కష్టములకు గురికావలసి వస్తుంది. సాధ్యమైనంత వరకు అందరియందు దైవత్వము ఉందన్న సత్యాన్ని గుర్తించి ఎవ్వరినీ బాధించకుండా చూసుకోండి. కనుక ప్రతి మానవుని యందు సత్ చిత్ ఆనందము ఉన్నది. ఆ ఆనందమే నాయందుకూడా ఉంటున్నదనే పవిత్ర భావము మీరు అభివృద్ధి చేసుకోవాలి. Love ever hurt never. ఇదే మానవుని యందు ఉన్న సక్రమమైన రాజమార్గము.

ప్రతి చిన్నవిషయమందు ఇతరులను నొప్పించటము ఇతరులను బాధించటము ఇది మానవత్వానికి సరియైన అర్థము కాదు. తన తత్వాన్ని తాను గుర్తించుకోలేక చుట్టూ ఉన్న వాతావరణమును మాలిన్యము చేయకూడదు. మానవుడు పుట్టినప్పుడు నిర్గుణుడుగా పుడుతున్నాడు. పెరుగుతూ పెరుగుతూ కేవలము కాలమార్పుచేత, ఆహారమార్పుచేత, సహవాసమార్పుచేత మానవత్వములో అనేక రకములైన ప్రభావములు అభివృద్ధి అవుతూ వస్తున్నాయి. చదువులో ప్రవేశించేటప్పటికి ఆపాదమస్తకము తనకంటె ముందుగానే తన చదువుకంటె ముందుగానే ఈ అహంకార మమకారములు ప్రవేశిస్తాయి. ఒక్కొక్కరు ఏవో five year plan అని ఐదేండ్ల వరకు తగిన ఆహారాన్ని పోగుచేసుకుంటే ఇంకా కొంతమంది

srisathyasaivachanamrutam

పది సంవత్సరముల వరకు ఆహారాన్ని పోగుచేసుకుంటే, ఈనాటి విద్యార్థులు ఎన్ని కరవులు వచ్చినా తరగని ఆస్తిని పొందాలని చూస్తూ ఉంటారు. ఈ విధమైన మితిమీరిన ఆశకు గురికావటముచేత మతిచెడుపుకుంటున్నారు. మొట్టమొదట విద్యార్థి గుర్తించవలసినది తన capacity తన యోగ్యతను, తనయొక్క జీవితాన్ని, తనయొక్క నిజాయితీని తాను గుర్తించాలి. తను తన తత్త్వాన్ని గుర్తించకుండా కేవలము చంద్రమండలము పోయినప్పటికీ అక్కడ శాంతి మనకు లభించదు. తనలో దుర్భావములు, దుర్గుణములు ఉంచుకొని ఎంత పవిత్రమైన వాతావరణములో జీవించినప్పటికీ శాంతిని పొందలేదు.

**హస్తమున అణుబాంబు ఉంచుక**
**అరచుచుందురు శాంతి శాంతి యని**
**చంద్రుచేరగలిగి కూడను**
**చెంద జాలరు శాంతి సుఖములు**

అన్నారు.

విద్యార్థులారా! మీ భావములు పవిత్రమైనవిగా మార్చుకోవాలి. నేను సచ్చిదానంద స్వరూపుడను అని దృఢముగా మీరు నమ్మాలి. మన చుట్టూ ఉండిన గాలియే మనకు కంటికి కనిపించదు. పోనీ ఆ గాలిని పట్టుకుందామంటే చేతికి చిక్కదు. అంత మాత్రము చేత గాలి లేదని నీవు వాదించగలవా. ఆ గాలి లేకపోతే నీవు ఎట్లా ఉన్నావు. కనుక దైవము లేదనేవాడు తనకు తాను లేదనుకునేవాడే. కనుక దివ్యత్వమనునది సర్వత్ర నిండిఉంటున్నది. దానిని గుర్తించుకోలేని శక్తి సామర్థ్యములు సంపాదించుకోలేక పోవటంచేతం ఈ అనర్థములలో మునిగి యదార్థమును మరచిపోతున్నాము.

**ఆత్మ తత్త్వము అలవరచుకోండి**

ప్రేమ స్వరూపులారా! దివ్యమైన తత్త్వము సర్వపదార్థములందు ఉంటున్నది. దానినే మనము ఈనాడు గుర్తించాలి. Unity in diversity అన్నింటి యందు ఉండిన ఏకత్వము ఏమిటని మనము వివరించాలి. ఆ ఏకత్వమే సత్ చిత్ ఆనందము. సత్ అనగా ఉన్నది. చిత్ దానికి సంబంధించిన awareness అన్నింటిని గుర్తింపచేసేది. ఈ ఉన్నది అనేది లేకపోతే

sri sathyasaivachanamrutam

దానిని గుర్తించటము ఎక్కడౌతుంది. గుర్తించటమనేది లేకపోతే అనుభవించటము ఏవిధముగా సాధ్యమవుతుంది. కనుక ఉన్న దానిని గుర్తించి, అనుభవించినప్పుడే ఆనందము లభ్యమవుతుంది. ప్రపంచమంతయు ఉన్నది. ఉన్నదని ఎట్లా చెప్పగలుగుతున్నావు. చెవులకు వినిపిస్తుంది. మనసుకు అనిపిస్తుంది. హృదయాన్ని మురిపిస్తుంది. ఇవన్నియూ కూడను జగత్తునందు ఉన్నవి. ఈ జగత్తునందు ఉన్నవి లేవని ఏరీతిగా భావించటము. అది ఉన్నది. ఆ ఉన్నది అనేది ఏవిధముగా ప్రభావితము అవుతున్నది. ఆకలి. ఈ ఆకలిని అన్నము తీరుస్తున్నాది. అన్నమనేది ఉన్నది. అన్నము ఉండటము చేతనే ఆకలి ప్రారంభమైంది. అన్నమే జగత్తులో లేకపోతే ఆకలే ఉండదు. ఆకలి ఉండటంచేతనే అన్నము వచ్చింది. కనుక మనము ఈనాడు గుర్తించవలసినది ఏమిటి? ఆకలి ముందా అన్నము ముందా? ఆకలి అని మనము భావిస్తున్నాము. కాదు. కాదు. అదే పొరపాటు. ఆహారమును సృష్టించిన తదుపరే ఆకలిని సృష్టించాడు. ఈ రెండు ఉండటంచేతనే మానవత్వమనే దేహము సంరక్షించుకో గలుగుతున్నాడు. ఆకలి దేహమునిమిత్తమై ఏర్పడినదేగాని జీవితము నిమిత్తము కాదు. కనుక నీవు జీవితము కోసం బ్రతుకుగానీ అన్నము కోసం బ్రతకవద్దు. అన్నము కోసము బ్రతికేవాడు పాపి. ఆత్మకోసం బ్రతికేవాడు గోపి అన్నారు. అన్నీ ఉంటున్నాయి లోకములో. జీవరాసులు కొన్ని ఏరీతిగా బ్రతుకుతున్నాయి. What is the essence of education అని మనము యోచన చేసుకున్నప్పుడు Education should be for life not for living. దీని కోసమే education అనుకుంటే ఎన్ని జీవ జంతువులు జగత్తులో జీవించటము లేదు. పశుపక్షి మృగాదులు, క్రిమికీటకాదులు జీవిస్తూనే ఉన్నాయి. అవి ఏ కాలేజీకి పోయినాయి. అవి ఎందులో డిగ్రీలు తీసుకున్నాయి. ఏమి చదివాయి. కనుక జీవించటానికి చదువుకావాలి గాని బ్రతుకు కోసము కాదు. నిజమైన ఆత్మతత్త్వము మనకు ఆవిర్భవించాలంటే దివ్యత్వములోనే మనకు లభిస్తుంది.

కంసుని కాలేజి యందు శ్రీకృష్ణుడు చదివెనా?
హిరణ్యకశిపుని కాలేజియందు ప్రహ్లాదుడు చదివెనా?

కాదు, కాదు. అది తనలో ఆవిర్భవించిన ఆత్మతత్త్వమే.

srisathyasaivachanamrutam

## రామాయణము ఆదర్శ గ్రంథము

భారతీయులకు ప్రధానమైన గ్రంథము ఆదర్శవంతమైన గ్రంథము నిత్యము మేల్కొల్పెడి గ్రంథము, ప్రతి కుటుంబమునకు ఆదర్శము నందించే గ్రంథము రామాయణము. ఈ రామాయణము నందు ఒకానొక సమయము లోపల రాములు తన సహజమైన తత్త్వాన్ని, కర్తవ్యాన్ని గుర్తింపజేసే నిమిత్తమై వసిష్ఠుల వారికి జవాబు చెప్పాడు. తాను చిత్రకూట పర్వతముపైన ఉండినప్పుడు భరత శతృఘ్నులు సమస్త పరివారముతో రాములను సందర్శించుటకు వెళ్ళారు. అతనితో సంభాషణ అంతా జరిగిన తరువాత రాములు జ్యేష్ఠ పుత్రుడు, పవిత్రుడు, అర్హుడు కనుక యీ రాజ్యము నేలటానికి రాములకు తప్ప నాకు అర్హత లేదన్నాడు భరతుడు. శ్రేష్ఠుడు, జ్యేష్ఠుడు అయిన రాములను వదలి నాకు ఏవిధముగా కడతారు అన్నింటి యందును నేను రాములకంటె అధముడను అన్నాడు భరతుడు. రామునిపైన ప్రేమచేత భరతుడు ఈ విధముగా అతనిని ప్రార్థిస్తూ వచ్చాడు. రాములు చెప్పాడు. నాయనా! మాట మనకు ప్రధానము. మాట మనకు ప్రాణము. ఇక్ష్వాకుల వంశములో ఆడినమాట తప్పినవాడు ఇంతవరకు కంటికి కనిపించలేదు. ఇటు ఇక్ష్వాకుల వంశమునందు జ్యేష్ఠుడై శ్రేష్ఠుడై జన్మించి మాటను తప్పిన అపకీర్తికి నేను గురికాను. నా ప్రాణము నైనను నేను ఆనందముగా అర్పింతును. కాని మాటను మాత్రము నేను తప్పను అన్నాడు.

అప్పుడు జాబాలి మహర్షి ఏదో ఒక విధముగా రాములను అయోధ్యకు పంపించి రామరాజ్యము స్థాపింపజేయాలనే ఉద్దేశ్యముతో రామచంద్రా! నీవు పరమమూర్ఖుడుగా ఉంటున్నావు. వృద్ధుడైన దశరథమహారాజు స్త్రీ వ్యామోహము చేత కైకకు వరమిస్తే ఆ వరమును నీవు ఆచరించటానికి ప్రయత్నము చేస్తే ఇందులో ఏమైనా అర్థము ఉందా? దశరథుడు మంచివాడని ఏరీతిగా నీవు చెప్పగలవు. కొడుకుని అమ్ముకొని భార్యను కొన్నాడు. అనగా కుమారుని అడవికి పంపించాడు భార్యను కొన్నాడు. ఇది సరియైనది కాదు. అంతేకాదు. ఇప్పుడు దశరథుడు లేడు. మరణించిన వారి మాటకోసమని నీవు ఎందుకు ఇంత పట్టుపడుతున్నావు అన్నాడు. అప్పుడు రాములు చెప్పాడు దేహము ఉండవచ్చు ఊడవచ్చు కాలవచ్చు కూలవచ్చు కాని మాట మాత్రము కూలదు. పాంచభౌతికమైన దేహము ఎప్పుడైనా రాలిపోవచ్చు. సత్యమునకు రూపము లేదు. సర్వత్రా నిండినది. త్రికాలబాధ్యమైనది. భూత

srisathyasaivahini.org

భవిష్యద్వర్తమానములందు కూడను సుక్షేమంగా ఉండేది. అట్టి సత్యాన్ని ఈనాడు పోగొట్టుకొనటానికి నేను ఒప్పుకోనన్నాడు. తిరిగి జాబాలి చెప్పాడు. చేతిలోనున్న పిట్టను వదలి పొదలోనున్న పిట్టను గురించి ప్రాకులాడేవాడు మూర్ఖుడు వివేకుడు అన్నాడు. నీవు కేవలము మరణించినవాని సత్యము కోసము ప్రాకులాడుతున్నావు. జీవించినవారి సత్యమును నీవు పోషించమని చెప్పాడు.

తక్షణమే ప్రక్కనున్న వసిష్ఠులవారు తిరిగి ప్రారంభించారు. వీరిద్దరి ఉద్దేశ్యమేమంటే ఎట్లనో శ్రీరామచంద్రుని అయోధ్యకు తీసుకుపోయి ఈ రాజ్యమును అతని తలపై పెట్టాలని ఉద్దేశ్యము. రామచంద్రా! పురుషులైనవారికి ముగ్గురు గురువులు. మొదటి గురువు తల్లి, రెండవ గురువు తండ్రి, మూడవవాడు ఆచార్యుడు. కనుక నీ తల్లి చెప్పిన మాటనే నీవు లక్ష్యము నందుంచుకొని కారడవులకు వచ్చావుగాని నేను ఆచార్యుడను. గురువు చాలా ప్రధానమైనవాడు. ఆచార్యుడనగా యేమిటి కేవలము పాఠాలు చెప్పే టీచరు కాదు. ఆచరించేవాడు ఆచార్యుడు అన్నారు. తాను ప్రేమించి పరులను ప్రేమించమని చెప్పేవాడు నిజమైన ఆచార్యుడు. దానికి శ్రీరామచంద్రుడు చక్కని జవాబు చెప్పాడు. మీరు ఆచార్యులు నిజమేగాని నాకే కాదు మా తండ్రికి మా తాత ముత్తాతలకు కూడను మీరు ఆచార్యులే. అయితే మీకు తగిన గౌరవాన్ని నేను అందిస్తాను. నవమాసములు మోసి కని పెంచి నా మల మూత్రాదులు శుభ్రపరచి నన్ను అనేక రకములుగా పోషించి రోగాదులయందు రాత్రింపవళ్ళు కాపాడి నన్ను ఇంతపైకి తీసుకువచ్చిన తల్లి నాకు ముఖ్యము. తదుపరి నాకు ఆహార విహారముల చేతను, కూడు బట్టలచేతను నన్ను పోషించి విద్యాభ్యాసము చేయించిన తండ్రి నాకు సర్వ ప్రధానము. వీరు ఇరువురు నన్ను ఈ స్థాయికి తెప్పించిన తరువాత ఆచార్యుడు వచ్చి కేవలము పాఠములు చెప్పుతూవచ్చాడు. తల్లే దేహమును ఇవ్వకపోతే తండ్రి ఈ దేహమును పోషించకపోతే ఆచార్యుడు ఎక్కడ? కనుక ఈ రెండింటిని సరైనరీతిలో పెట్టుకున్నప్పుడే ఆచార్యుడు దీనిని దీపముగా అంటిస్తున్నాడు. కనుక నాకు ఆచార్యుడు గౌరవనీయుడే. నా తల్లి తండ్రుల కంటె గొప్పవాడు కాదన్నాడు. తిరిగి జాబాలి ప్రవేశించి మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ అని మంత్రమును ప్రారంభించాడు. అప్పుడు వసిష్ఠులవారు రామోవిగ్రహవాన్ ధర్మః అన్నాడు. నీవు నిజముగా ధర్మమునే ఈ ఆకారము ధరించి వచ్చావు. రామచంద్రా! ఇంక నీ దగ్గర

srisathyasaivachanamrutam

మేము మాట్లాడలేము అన్నాడు.

కనుక ఇలాంటి దివ్యత్వములు రామాయణము నందు భారతమునందు ఎన్నో మనకు కనిపిస్తున్నాయి. మనము ఈ unity in diversity అన్నింటి యందు ఉండిన ఏకత్వాన్ని గుర్తించటానికి మనం ప్రయత్నంచేయాలి. అప్పుడే మనకు శాంతి లభిస్తుంది. కనుక మనలో ఉండిన దుర్గుణములు దూరము చేసుకోవాలంటే తల్లిదండ్రులకు తగినంత కృతజ్ఞతనిచ్చి చదివిన instituteకు సరైన పేరు తెప్పించి ఎక్కడికి వెళ్ళినా మన నడతను మన హస్తములో పెట్టుకోవాలి. మన నడతనే సరిలేకపోతే మన జీవితమే పాడైపోతుంది. మన శీలమే, మన character మనకు తగిన విలువ నందించాలి. ఈనాడు లోకము లోపల అమిత ప్రఖ్యాతిగాంచిన పెద్దలుగాని, పేరు ప్రతిష్ఠలనొందిన మహనీయులుగాని వారి నడతను బట్టేవారికి ఆ కీర్తి వచ్చింది. మనది మానవజాతి అని మనము విశ్వసించాలి. ఆ మానవజాతికి తగిన గౌరవమును మనము అందించాలి.

**జాతి గౌరవంబు నీతిపై నిలుచును**
**నీతిలేక యున్న జాతి చెడును**
**నీతి కలుగు జాతి నిజమైన జాతిరా**
**వినుడు భారతీయ వీరసుతుడ!**

నీవు భారతీయుడవు. భ అనగా భగవత్ ప్రకాశము. రతి దానిని ఆశించినవాడు. వాడే భారతీయుడు. ఆ divinityని మనము ఆశించాలి. దానియందు అన్ని రకములైన విద్యలు మనము అభ్యసించాలి. నారదుడు 64 విద్యలు చదివాడు. మీరేమో ఫిజిక్సు కెమిస్ట్రీ బోటనీ జూలాజీ అని నేర్చుకుంటున్నారు. అతను 64 విద్యలు నేర్చుకున్నాడు. అరువది నాలుగు విద్యలు నేర్చిన నారదునికే మనశ్శాంతి లేకపోయింది.

**లోకహితాన్ని ఆశించండి**

విద్యార్థులారా! ముఖ్యముగా మీరు గుర్తించవలసిన విషయము ఒక్కటి. నాలుగువేదములు, ఇంక ఉపశాస్త్రములు ఎన్నో నేర్పించాడు రామలక్ష్మణ భరత శత్రుఘ్నులకు దశరథుడు. వీరందరికంటెను ఎక్కువ విద్యలు నేర్చినవాడు రావణుడు. రావణునికి తెలిసిన

sri sathyasai vacharamrutam

విద్యలు జగత్తులో ఎవరికి తెలియవు. గజకర్ణ విద్య, గోకర్ణ విద్య, పక్షి విద్య అన్నీ నేర్చినవాడు రావణుడు. రామాయణములో ఒక చోట రావణుడు పరమమూర్ఖుడు అని వర్ణించాడు వాల్మీకి. ఇన్ని విద్యలు నేర్చినవానిని పరమమూర్ఖుడని ఎందుకని పేరుపెట్టాడు. లవకుశులే అడిగారు వాల్మీకిని. గురూజీ రామచంద్రుడు ఎన్నో విద్యలు నేర్చినవాడు. గొప్ప మహనీయుడు, మహాజ్ఞాని అని చెబుతున్నారు. అతనికంటె ఎక్కువ విద్యలు నేర్చిన రావణుని మూర్ఖుడంటున్నారు. దీనిలోని అంతరార్థము ఏమిటి అన్నారు. వాల్మీకి అన్నాడు రావణుడు విద్యావంతుడు. రాములు జ్ఞాని. అనగా ఇక్కడ మనము విచారించవలసినది విద్యకు జ్ఞానమునకు ఏమి వ్యత్యాసము. గ్రంథ పరిచయముచేత విద్యనభ్యసించినవాడు రావణుడు. ఆచరణచేత ఇంద్రియములను నిగ్రహించి సర్వసుఖములు త్యజించి లోకకళ్యాణము నిమిత్తమై తనయొక్క తత్వాన్ని ఆచరణలో పెట్టాడు. అతను జ్ఞాని అన్నాడు. స్వార్థము స్వప్రయోజనమునకు ఉపయోగపెట్టే విద్యలు విద్యలు కావు. లోక కళ్యాణమునకు, మానవ కళ్యాణమునకు ఈ విద్యలు మనము వినియోగపెట్టాలి. లోకహితమును కోరి మనము విద్యనభ్యసించాలి. స్వహితాన్ని ఆశించినవాడు రావణుడు. లోకహితాన్ని ఆశించినవాడు రాముడు. కనుక మానవజాతిని సంరక్షించటానికి జాతిని ఆదర్శవంతమైన జాతిగా అభివృద్ధి గావించటానికి విద్యలను ఆచరించి ఇతరులకు అందించి తాను ఆనందించాలి.

ప్రేమస్వరూపులైన విద్యార్థులారా! ఇక్కడ ఉన్నంతకాలము పిల్లలంతా చాలా మంచివారే. పిల్లలంటే నాకు ప్రాణము. నా ప్రోపర్టీ అంతాకూడను మీరే. మీ నిమిత్తమై, మిమ్మల్ని ఉత్తమ మార్గములో తెప్పించే నిమిత్తమై, మిమ్ములను పవిత్రము గావించే నిమిత్తమై నా దేహము, నా ప్రాణము, నా రక్తము మీకిచ్చి అన్ని విధములైన మార్గముల ప్రయత్నించాను. ఏ స్వార్థము నాకు లేదు. ఏ స్వప్రయోజనము నేను ఆశించలేదు. పిల్లలను సరియైన మార్గములో పెట్టి రేపు ఆదర్శవంతమైన భారతీయులుగా తయారు చెయ్యాలి. కానీ ఆ ప్రేమతత్వాన్ని మీరు గుర్తించుకోలేకపోతున్నారు. ఒక తల్లిప్రేమనే అనుభవించని మీరు వేయి తల్లుల ప్రేమ ఏ విధముగా అనుభవించగలరు. ఇది సాధ్యము కాదు. మీ నిమిత్తమై నేను ఎన్ని విధములైన ప్రయత్నములు చేస్తున్నానో అది స్వామికి తప్ప అన్యులకు ఏమాత్రము తెలియదు. కానీ ఏ అణుమాత్రమైనా మీరు గుర్తించి దానిని కొంతవరకునైనా ఆచరణలో పెట్టి బయటి ప్రపంచము

srisathyasai vachanamrutam

లోపల ఆదర్శవంతమైన జీవులుగా మీరు ఉండాలని నేను ఆశిస్తున్నాను.

విద్యార్థులారా! మీరు చదివే చదువుకు, ప్రపంచములో మీరు ప్రవేశించి చేసే పనులకు ఏమీ సంబంధమే ఉండదు. ఈనాడు MBA పిల్లలు ఎన్నో విషయములను గుర్తించుకోటానికి ప్రయత్నించారు. కేవలము అమెరికాది కాకుండా, రష్యాది కాకుండా, జపాన్‌ది కాకుండా మన దేశము యొక్క సంస్కృతిని గురించి మీరు ఎంతో గుర్తించుకోటానికి ప్రయత్నించారు. భారతదేశములో ఉన్న మహనీయుల తత్త్వాన్ని మీరు చదువుతూ వచ్చారు. ఎన్ని చదివినప్పటికి ఏ ఫ్యాక్టరీలోనో, ఏ ఇండ్రస్టీలోనో మీరు పోయి ఉద్యోగములో ప్రవేశించినారంటే ఇవి ఏమాత్రము ప్రాక్టికల్‌లో పెట్టటానికి లేదు. నీవు చదినవి అక్కడ ప్రవేశపెట్టటానికి పూనుకుంటివా ఈ పిచ్చి పిచ్చివన్నీ మాకు అక్కరలేదు. పనిచేయి అంటాడు మేనేజరు. మేనేజరు వరకు పోనక్కరలేదు. అక్కడ work man ఉంటాడు. ఆ మిషన్ దగ్గర work man దగ్గరకు పోయి ఏమి చేస్తున్నావు, ఎట్లా చేస్తున్నావు అంటే పోపొండి సార్ మీకేమి తెలుసు. ఇరవై యేండ్లు నాకు experience ఉంది. నాకంటె మీరు పుస్తకములో చదివినవారు మీకేమి తెలుసునంటాడు. కనుక కేవలము ఒక worker దగ్గర కూడను ఛీ అనిపించుకొనే పరిస్థితి వస్తుంది. ఐతే అక్కడ మనము నేర్చవలసినది ఏమిటి? శాంతముగా ఓపికపట్టి ఆ వర్కర్సు దగ్గరకూడను ఆ మిషన్ యొక్క తత్త్వాన్ని మనము అర్థము చేసుకోవటానికి ప్రయత్నించాలి. life is awareness. అన్నీ తెలుసుకోవాలి. నేను MBA pass చేశానని చెప్పి airconditon roomలో కూర్చుని కాగితాలు తెప్పించుకొని పనిచేస్తుంటే ఆ కాగితాలు నీ ముఖాన్నే కొట్టి పోతారు వాళ్లు. ఫ్యాక్టరీలో ప్రవేశించి ఎక్కడెక్కడ ఏమి చేస్తున్నారు, చిన్న చిన్న బోల్టు, నట్టు, స్క్రూలు యేవిధముగా బిగిస్తున్నారు అని చక్కగా మనము ప్రాక్టికల్‌లో అనుభవించాలి.

విద్యార్థులారా! awareness అంటే అర్థము చేసుకోండి. ఒక విషయమునో లేక ఒక వ్యక్తినో లేక ఒక పదార్థమునో పరిపూర్ణముగా గుర్తించుకోటమే awareness. ఏదో అంతాయింతో చూసేది, నాకు అంతా తెలిసింది అంటే అది awareness కాదు. ఇది చూడండి ఇది పెద్ద hand kerchief దీన్నంతా లోపల పెట్టుకొని ఇది ఏమిటంటే ఏమిటి

మీరు చెప్పగలరు. కాగితము ముక్కో లేక బట్టముక్కో అంటావు. కాని అంతటిని చూసేటప్పటికి hand kerchief అని correct answer వస్తుంది. అదే పరిపూర్ణముగా గుర్తించుకున్నవాడు పరిపూర్ణముగా స్వరూపాన్ని బోధిస్తాడు. కనుక మన విషయము లోపల మంచి చెడ్డ అన్నింటిని విచారణ చెయ్యాలి. అప్పుడే MBA పిల్లలు ఇక్కడ MBA చదివినందుకు ఆదర్శమునందించిన వారౌతారు. విద్యార్థులారా! మీరు ఈ సంవత్సరము పూర్తి చేసుకొని విశాల ప్రపంచములో ప్రవేశిస్తున్నారు. మొట్టమొదట మీరు గుర్తించవలసినది communication అభివృద్ధిపరచుకోవాలి. communication అంటే మార్కెట్‌లో communication లేక share holders తో communication ఇంకే విధమైన communication కాదిది. understanding is communication అని గుర్తించుకోవాలి. అందరు ఎలాంటివారు workers ఏ విధముగా చేస్తున్నారు. Raw material ఎక్కడ ఉంది. కరెంటు ఎక్కడ ఉంటున్నాది. ఇవన్నీ చక్కగా గుర్తించుకొని అన్నింటియందు సమత్వాన్ని చూచినప్పుడు communication అర్థమవుతుంది. ఒక ఫ్యాక్టరీ లోపల మంచి పనిచేసే సమయము లోపల కరెంటు stop అయిపోయింది. దీనికి తగిన పద్ధతులు కొన్నిముందుగానే ఆధారము చేసుకొని ఉండాలి. ఆయన చెప్పేస్తాడు నాకు తెలియదు work man ఎక్కడ ఏమి చేశాడో యేమిటో అని లైన్‌మేన్ పైన వేస్తాడు. లైన్‌మేన్ చెప్పేస్తాడు మెయిన్ ఫీజు లోపల పాడైందని. ఈ communication అన్నీ చుట్టి వచ్చేటప్పటికి రెండు దినములైపోతుంది. కనుక మన work shop లో పోయిందా లేక అందరికి పోయిందా? అని యోచించాలి. మన ఫ్యాక్టరీకి కొంచెము లాస్ వస్తుంది కొంచెము profit వస్తుంటాది. ఈ లాస్‌కు కారణం ఏమిటి? ఈ profitకి కారణం ఏమిటి? profit కోసం చూశామంటే దాంట్లో quality తగ్గించామా లేక competetion ఏమైనా ఎక్కువ వచ్చిందా ఇవన్నీ యోచన చేసుకోవాలి. ఈనాడు ఎలా ఉందంటే Imitation and competetion ఈ రెండింటితో చాలా దిగజారి పోతున్నాది. మన క్వాలీటిని ఏమాత్రము తగ్గించకూడదు. ఏదైనా మనము తగ్గించవచ్చుగాని క్వాలిటీని మనము తగ్గించకూడదు. క్వాంటిటీ కాదు క్వాలిటీ కావాలి. డబ్బుకోసమని ఎవరో competetion వచ్చేసరికి మనము quality తగ్గించి వేస్తే బాగుండదు.

sri sathyasai vachanamrutam

## దివ్యభావములతో మెలగండి

విద్యార్థులారా! MBA పిల్లలూ! ప్రత్యేకముగా మీరందరు బయటకు వెళ్ళిన తరువాత సాధ్యమైనంతవరకు కూడను ఒక దివ్యభావమును లోపల పెట్టుకొని మీ మీ పనులు మీరు చక్కగా సాగిస్తారని నేను ఆశిస్తున్నాను. పిల్లలు మంచివారే. కానీ వాతావరణము లోపల కొంతవరకు దానిని తట్టుకొని నెట్టుకోవలసి వస్తుంది. మీకందరికి తెలుసును కట్టా ప్రసాద్ అన్న పిల్లవాడు ఈనాడు వచ్చాడు. అతనికి స్వామి దయలోపల బిర్లా కంపెనీలో ఉద్యోగము ఇచ్చారు. స్వామి యొక్క ఆజ్ఞను, స్వామి యొక్క ఆర్డరును, స్వామి యొక్క discipline తూచ తప్పకుండా నడచుకుంటున్నాడు. రెండు నెలల లోపలనే మేనేజరు, వర్కర్సు దానిలో ఉండిన మెంబర్సు అతనిని చాలా good boy అని అతనిని పొగిడితే అదే నాకు ఆనందము వేసింది. అదే మీరు నాకు ఇవ్వవలసిన కృతజ్ఞత. ఇతరుల దగ్గర మంచి పేరు తెచ్చుకుంటే అదే నాకు చాలు. ఆఫీసరు letter వ్రాశాడు. ఫలాని Institute నుండి వచ్చిన పిల్లవాడు best best అని ఐదారు తూర్లు best అని వ్రాశాడు. అలాంటి మంచి పిల్లలను మేము ఎంతమందైననూ చేర్చుకుంటామని స్వామికి ప్రార్థన చేస్తున్నారు. ఇక్కడ మన కర్నాటకలో కూడను టుంకూరులో రోడ్డులో బిర్లా factoryకు ముగ్గురిని పంపించమన్నారు. వాళ్లకు పంపించేశాను. పంపటం నావంతు. కానీ ఆ గౌరవమును నిల్పుకోవటం మీ వంతు. నా స్థాయినుండి నేను ఎంత జాగ్రత్తగా చేస్తున్నానో మీ స్థాయి నుండి మీరు అంత జాగ్రత్తగా చేయాలి. ఇక్కడ negative, positive రెండు కూడను సరియైన conditionలో ఉండాలి. ఒక టిన్ను నుండి మరొక టిన్నుకు ఆయిలు పొయ్యాలనుకుంటే ఎంత studyగా ఉంటుండాలి. క్రింద పోయించుకునే టిన్ను కదలినా ఆయిల్ క్రిందపడి పోతుంది. పైనపోసే టిన్ను కదలినా ఆయిలు క్రింద పడిపోతుంది. అదే ఏకధార, స్వామియొక్క ఆశయాలు ధారగా మీరు ఆచరించాలంటే తప్పక మీరు ఉన్నత ఆదర్శమును అందించగలరు. ఫారెన్ కంపెనీ కూడను ఇద్దరిని పంపమని చెప్పారు. ఆ ఫారిన్ కంపెనీలో కూడను శర్మ అని అనంతపురములోని ప్రొఫెసరు కుమారుడు అతనిని చేర్చినాము. వచ్చే నెల లోపల అతనిని అమెరికాకు తీసుకుపోతున్నారు. అలాంటి మంచిగుణములు ఉన్నవాళ్లు వస్తే ఎవరికైనా ఆనందమే కదా! నేను గట్టిగా చెప్పాను. అయ్యా! నీవు అమెరికాకు పోవటము గొప్పతనము కాదు. కాని అక్కడకు

srisathyasaivahini.org

వెళ్ళి ఈ ప్రశాంతినిలయ వాతావరణమును అమెరికా వాతావరణములో చేర్చుకోమంటున్నాను.

**అమెరికా మార్గమ్ము నరయ చూచును గాని**
**కాశికా మార్గమ్ము కానరాడు**
**ఆల్జిబ్రా యంత అరసి చూచును గాని**
**ఇంటి వైశాల్యంబు నెరుగబోడు**
**అనుదినంబును డ్రిల్లుననుసరించునుగాని**
**పద్మాసనము వేయ బాధపడును**
**వృక్ష శాస్త్ర మెరుగు సమృద్ధిగాను తులసి**
**ఉపయోగ మెరుగడు మానవుండు**

నాలుగు తులసి ఆకులు తీసుకుంటే రోగమునకు అవకాశమే వుండదు. అందుకోసమే భారతదేశములో ప్రతిగృహమందు తులసిని స్థాపించేది. ఆ గాలి వలన ఈ క్రిమికీటకాదులు కలరా ఇలాంటి infections రావు. భారతదేశములో ప్రాచీన కాలమునుండి ఎంతో పవిత్రమైన ఆదర్శములను అందిస్తూ వచ్చారు. కానీ ఈనాడు అన్నీ అలక్ష్యముగా భావిస్తున్నారు.

**బ్రహ్మభావంబు ఎరుగక బ్రాహ్మణుండ**
**సద్గుణములు లేకున్న సజ్జనుండ**
**మంచి నడతలు లేకున్న మానవుండ**
**చెప్పరయ్య మీరు ఒప్పుకొందు**

మంచినడతలు లేకపోతే మానవుడెట్లా అవుతాడు. సద్గుణములు లేక సజ్జనుడెట్లా అవుతాడు. బ్రహ్మ అంటే తెలియనివాడు బ్రాహ్మణుడెట్లా అవుతాడు. కనుకనే వేదాంతము బ్రహ్మ విత్ బ్రహ్మైవ భవతి. దానిని గుర్తించినవాడే బ్రహ్మ అవుతాడు.

విద్యార్థులారా! మీరు ఏడు సంవత్సరములు, తొమ్మిది సంవత్సరములు, పన్నెండు సంవత్సరముల కాలము ఇచ్చట గడపిన వారు ఇందులో ఉంటున్నారు. కాని ఇంతకాలము ఈ ప్రశాంత వాతావరణములో పవిత్రమైన భావములో కాలము గడపిన వారు బయటి ప్రదేశము లోపల ఈ పవిత్రతనే అనేక రకములుగా కాపాడుకోటానికి ప్రయత్నించాలని నేను

srisathyasaivachanamrutam

ఆశిస్తున్నాను. ఈ ఆచరణను, ఈ behaviourను, ఈ manners ఈ discipline మీరు ఉంచుకున్ననాడు వాడు ఎక్కడ ఉండినా ప్రశాంతి నిలయమువాడే. వాడు ఎక్కడ ఉండినా స్వామికి సంబంధించినవాడే. ఐతే

**నేను నేనున్న దానిలో లేను నేను**
**నీవు నీవున్న దానిలో లేదు నేను**
**నీవు నేనును ఏకమై నిలచివున్న**
**అట్టి సర్వంబు ఉండు నక్కడ.**

I and you are one అంటారు ఎంత తప్పు. I and you are we, not one. we అవుతుంది one కాదు. we and we are we. నీలో నేను నాలో నీవు ఉండినప్పుడు మనము ఒక్కటే అయిపోతాము. కనుక నీవునేను అని రెండు కలిసినప్పుడు we అవుతుందిగాని ఒకటి కాము. ఈ తత్త్వాన్ని మీరు చక్కగా భద్రము చేసుకోండి. నీలో స్వామిని స్వామిలో నువ్వు ఉండే తత్త్వాన్ని భద్రపరచుకుంటే జగత్తుఅంతా నీలో ఉంటుంది. ప్రశాంతి నిలయములో ఏ విధముగా మినీ ప్రపంచము ఉంటున్నాదో, అన్ని దేశములవారు ఎట్లా ఉంటున్నారో ఆ రీతిగా నీవు ఏ దేశములో ఉంటున్నాగాని నీలో స్వామి ఉన్నాడు ఈ పవిత్రమైన భావములు హృదయములో ప్రతిష్ఠ చేసుకొని తల్లిదండ్రుల దగ్గర చేరి వారు ఆశపడితే పెండ్లి చేసుకొని చక్కగా కుటుంబము పోషించుకొని, బయటి ప్రపంచముతో సరైన రీతిలో నడతను అభివృద్ధి పరచుకొని, బ్రహ్మ చర్యములో ఉంతడిన పవిత్రమైన పేరునే గృహస్థమందు, గృహస్థము నందున్న పేరునే ఆధ్యాత్మికమునందు అభివృద్ధి పరచుకుంటారని ఆశిస్తూ ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**(తేది. 12-02-1989న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vacharamrutam